క్లుప్తంగా

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ


పాఠం బోధిస్తున్న విద్యార్థిని

కెరమెరి: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మ దినం సందర్భంగా మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శనివారం స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలో తరగతిగదుల్లో పాఠాలు బోధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

సీహెచ్‌సీ సూపరింటెండెంట్‌గా అవినాష్ కుమార్


అవినాష్‌కుమార్

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ సామాజిక ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ అవినాష్ కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సూపరింటెండెంట్‌గా ఉన్న చెన్నకేశవ్‌ను ఉట్నూర్‌కు బదిలీ అయ్యాడు. బెజ్జూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ విధులు నిర్వహించిన అవినాష్‌కుమార్ పదోన్నతిపై కాగజ్‌నగర్ సీహెచ్‌సీకి వచ్చారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు.

నేడు వేంకటేశ్వరస్వామి ఆలయం మూసివేత

రెబ్బెన: మండలంలోని గంగాపూర్‌లో గల ప్రసిద్ధ శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని ఆదివారం చంద్రగ్రహణం సందర్భంగా మూసివేస్తున్నట్లు ఆలయ అర్చకులు కొమ్మెర గణేశ్‌శర్మ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుండి సోమవారం ఉదయం 6 గంటల వరకు ఆలయం మూసి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. చంద్రగ్రహణం పూర్తయ్యాక ఆలయాన్ని సంప్రోక్షణ చేసిన అనంతరం అభిషేక పూజలతో ఆలయాన్ని తెరవనున్నట్లు తెలిపారు. భక్తులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన సూచించారు.

108లో ప్రసవం

కౌటాల: మండలంలోని బాలేపల్లి గ్రామానికి చెందిన గర్భిణి చునార్కార్ సులభకు శనివారం వేకువ జామున పురుటి నొప్పులు రాగా కుటుంబీకులు 108కు సమాచారం ఇచ్చారు. సిబ్బంది గ్రామానికి చేరుకుని గర్భిణిని సిర్పూర్(టి) సామాజిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో కౌటాల మండలం మొగడ్‌దగడ్ సమీపంలో నొప్పులు అధికమయ్యాయి. దీంతో ఈఎంటీ పిట్టల విజయ్, పైలట్ సురేశ్‌లు వాహనంలో సాధారణ ప్రసవం చేశారు. తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారని, మెరుగైన వైద్యం కోసం సిర్పూర్(టి) సామాజిక ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులతో విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో 2000–22 విద్యా సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శనివారం అప్పుడు విద్యను బోధించిన ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు. ఏఎస్‌ఈ ఒలింపియాడ్స్ అకాడమిక్ డైరెక్టర్ కృష్ణ చైతన్య, ఇతర పూర్వ విద్యార్థులు ఆచార్యుల ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగేంద్ర, అమిత్ కుమార్, శృతిక, శైలజ, శ్రావణ్, శ్రీనివాస్, కృపాల్, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు పద్ధతిలో వైద్యుల పోస్టుల భర్తీ

కాగజ్‌నగర్ టౌన్: జిల్లాలోని ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్య పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు వైద్య విధాన పరిషత్ జిల్లా పర్యవేక్షణ అధికారి అవినాష్ కుమార్ ప్రకటనలో తెలిపారు. సిర్పూర్ (టి), కాగజ్‌నగర్, బెజ్జూరు, తిర్యాణి, వాంకిడి, జైనూర్‌లో ఉన్న గైనకాలజిస్టు, పిడియాట్రిక్, జనరల్ మెడిసిన్, జనరల్ డాక్టర్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయనున్నామన్నారు. ఈనెల 11న ఉదయం 10.30 గంటలకు జిల్లా కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు.

నిరంతర వెలుగులు

- ఆన్‌ఆఫ్ స్విచ్చులు లేక రోజంతా వెలుగుతున్న వీధి దీపాలు
- గ్రామ పంచాయతీలపై బిల్లుల భారం
- పట్టించుకోని అధికారులు


బంబారలో వెలుగుతున్న హైమాస్ట్ లైట్


వాంకిడిలో వెలుగుతున్న వీధి దీపాలు

వాంకిడి: విద్యుత్ వృధాను అరికట్టాల్సిన అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వీధి దీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. పంచాయతీ .అధికారుల నిర్లక్ష్యానికి పగలు, రాత్రి తేడా లేకుండా వీధి దీపాలు వెలుగుతుండడంతో గ్రామ పంచాయతీలపై బిల్లుల భారం పడడమే కాకుండా బల్బులు త్వరగా పాడైపోతున్నాయి. గతంలో విద్యుత్ స్తంభాల వద్ద ఏర్పాటు చేసిన ఆన్ ఆఫ్ స్విచ్చులు కొన్ని పాడైపోయాయి. మరి కొన్నిచోట్ల ఉన్నప్పటికీ ఉపయోగించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. పంచాయతీ అధికారులు విద్యుత్ వృధాపై దృష్టి సారించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బిల్లుల భారం..

అధికారుల నిర్లక్ష్యానికి విద్యుత్ బిల్లుల భారం పంచాయతీలపై పడుతోంది. సర్పంచుల పదవీకాలం ముగిసిన తర్వాత జీపీలకు రావాల్సిన నిధులు నిలిచిపోయాయి. అప్పటి నుంచి వీధి దీపాల బిల్లులు ప్రభుత్వమే ట్రాన్స్‌కోకు చెల్లిస్తోంది. గ్రామ పంచాయతీలకు వచ్చే అభివృద్ధి నిధుల నుంచి చెల్లించిన విద్యుత్ బిల్లులను మినహాయిస్తుంది. విద్యుత్ నియంత్రణపై దృష్టి సారించి వీధి దీపాలు రాత్రుల్లో మాత్రమే వెలిగేలా చర్యలు తీసుకుంటే గ్రామాల్లో ఇతర అభివృద్ధి పనులకు వాడుకునే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయాలు వ్యక్తంచేస్తున్నారు. మండలంలో మొత్తం 28 గ్రామ పంచాయతీలుఉన్నాయి. అన్నీ గ్రామ పంచాయతీలకు కలిపి ప్రతీ నెల రూ.4 లక్షల వరకు కరెంట్ బిల్లు వస్తుందని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

కరువైన పట్టింపు..

వీధి దీపాల నిర్వాహణపై పట్టింపు కరువైంది. జీపీలలో నిధులు లేక ఎలాంటి అభివృద్ధి పనులు జరగడం లేదు. అనేక గ్రామాలలో వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఉన్న దీపాలను కాపాడుకోవాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద హైమాస్ట్ లైట్లు కూడా ఏర్పాటు చేశారు. వాటిని పగలు బంద్ చేసి రాత్రుల్లో వెలిగేలా టైమర్ సెట్ చేస్తారు. దీంతో అవసరానికి అనుగుణంగా వెలుగుతుంటాయి. కానీ వాటిని ఏర్పాటు చేసిన కొన్ని నెలలు బాగానే ఉన్నా ప్రస్తుతం వివిధ గ్రామాల్లో పగలు రాత్రి తేడా లేకుండా వెలుగుతూనే ఉన్నాయి. అనేక చోట్ల చిన్నచిన్న రిపేర్ల వలన మొత్తానికే వెలగడం లేదు. పంచాయతీ అధికారులు దీనిపై దృష్టి సారించి స్విచ్చులు ఏర్పాటు చేసి ఆన్‌ఆఫ్ విధానం అమలు చేస్తే ఉన్న వాటినైనా కాపాడుకునే అవకాశం ఉంటుంది. అయితే వీధి దీపాల నిర్వాహణ పూర్తిగా గ్రామ పంచాయతీలదేనని, ఉదయమే బంద్ చేసుకుంటే విద్యుత్ వృధా అరికట్టవచ్చని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

చర్యలు తీసుకుంటాం

పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతోంది. ఎక్కడైనా ఆన్‌ఆఫ్ స్విచ్చులు పాడైపోయి ఉంటే సరిచేసి విద్యుత్ వృధాను అరికట్టేలా చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో విద్యుత్ దీపాల ఆవశ్యకతపై ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించాం. ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటాం.

– ఖాజా అజీజుద్దీన్, ఎంపీడీవో

ఓటరు జాబితా విడుదల


ఓటరు జాబితాను విడుదల చేస్తున్న ఎంపీడీవో


ఓటరు జాబితాను విడుదల చేస్తున్న అధికారులు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సత్యనారాయణ పోలీంగ్‌కేంద్రాలు, ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల డ్రాఫ్ట్ ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలను కార్యాలయంలోని బోర్డుపై ప్రదర్శించామని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 8లోపు ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

కౌటాల: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీవో మహేందర్‌రెడ్డి ఓటరు జాబితాను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాదేశిక ఎన్నికల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఓటరు జాబితాను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఓటరు జాబితాను అందుబాటులో ఉంచామన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 8 వరకు తెలపాలన్నారు. ఈసీ సంతోష్, కార్యదర్శులు సాయికృష్ణ, భాస్కర్, సిబ్బంది శ్రీకాంత్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల జాబితా..

లింగాపూర్: రాష్ట్ర ఎన్నికల సంఘం కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం ఎంపీడీవో కార్యాలయంలో పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రదర్శించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ ప్రకారం డ్రాఫ్ట్ ఫొటో ఓటర్ జాబితా, డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాల జాబితాలను కార్యాలయంలోని నోటీసు బోర్డుపై ప్రదర్శించినట్లు ఎంపీడీవో రాంచందర్ తెలిపారు.


ఎంపీడీవో కార్యాలయంలో కేంద్రాల జాబితా

జైనూర్: ఎన్నికల కమిషన్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాల వివరాలను శనివారం ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి మండల పరిషత్ కార్యాలయంలోని నోటీస్ బోర్డుపై ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు, ప్రజలు జాబితాను పరిశీలించి ఎలాంటి అభ్యంతరాలున్నా తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మోహన్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

కాగజ్‌నగర్ టౌన్: పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్క కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్సీ నివాసంలో దహెగాం మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఎల్కరి వెంకటేశ్, బ్రహ్మయ్య, బాబాజీ, దన్నూరి సాయి,సిద్ధం రాజు, బురం అంకుల్, కొడిపాక సాంబయ్యలు ఉన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన డీఎస్పీ

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఎండీ. వహీఉద్దీన్ శనివారం ఎమ్మెల్సీ నివాసంలో ఎమ్మెల్సీ దండె విఠల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే కాగజ్‌నగర్‌లో డీఎస్పీగా పని చేసిన రామానుజంకు ఏఎస్పీగా పదోన్నతి రావడంతో ఎమ్మెల్సీ దండె విఠల్‌ను ఎమ్మెల్సీ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు.


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ

కార్మికులకు సురక్షిత రోడ్డు ఏర్పాటు చేయాలి

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూర ఓసీపీకి వెళ్లే కార్మికుల కోసం యాజమాన్యం సురక్షితమైన రోడ్డును ఏర్పాటు చేయాలని హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు అన్నారు. శనివారం గోలేటి టౌన్‌షిప్ లోని హెచ్‌ఎంఎస్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఖైరిగూడ ఓసీపీకి వెళ్లే మార్గంలోని పావురాల గుట్ట వద్ద కొండచెరియలు విరిగిపడి రోడ్డు దెబ్బతిందని యాజమాన్యం తాత్కాలికంగా రోడ్డు పనులు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించిందన్నారు. అయితే వర్షాలు పడిన ప్రతిసారి ఇదే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం సురక్షితమైన రోడ్డు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. సమావేశంలో బ్రాంచి కార్యదర్శి శివారెడ్డి, ఏరియా ఆర్గనైజర్ ఎస్‌కే అనూష్, ఎస్‌అండ్‌పీసీ అసిస్టెంట్ పిట్ కార్యదర్శి కిష్టస్వామి, సీహెచ్‌పీ పిట్ కార్యదర్శి ఉమామహేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పత్తెం రాజాబాబు

విద్యార్థుల ఎదుగుదలలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

ఉట్నూర్‌రూరల్: విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందని ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. శనివారం కుమురం భీం కాంప్లెక్స్‌లోని పీఎంఆర్‌సీ హాల్‌లో ఏర్పాటు చేసిన గురు పూజోత్సవానికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి హాజరయ్యారు. విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. ఏ రంగంలోనైనా రాణించేందుకు గురువు అవసరమన్నారు. ఉపాధ్యాయులు వారి గురుతర బాధ్యతను నిర్వర్తించి దేశానికి మంచి పౌరులను అందించాలని అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తరగతి గది దేశ భవిష్యత్ నిర్మాణంలో ప్రాముఖ్యత కలిగి ఉంటుందన్నారు. ప్రభుత్వం పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తూ నాణ్యమైన విద్యను అందిస్తుందన్నారు. ఉమ్మడి జిల్లాల ఆశ్రమ పాఠశాలలలో ఉత్తమ సేవలు అందించిన 64 మంది ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలతో పాటు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా గిరిజన సంక్షేమ శాఖల ఉపసంచాలకులు అంబాజీ, రమాదేవి, జనార్దన్, అగస్టీన్, పీవీటీజీ ఏపీవో మెస్రం మనోహర్, తదితరులు పాల్గొన్నారు.


ప్రశంసా పత్రాలు అందుకున్న ఉపాధ్యాయులతో పీవో, ఎమ్మెల్యే

లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

బోథ్: లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని మండల కేంద్రంలోని కుమురం భీం విగ్రహం వద్ద రాజ్‌గోండ్ సేవా సమితి ఆధ్వర్యంలో నినాదాలు చేశారు. సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిన సోయం బాపూరావు, తెల్లం వెంకటరావుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అక్రమంగా ఎస్టీ సర్టిఫికెట్లు పొంది ఆదివాసీల ఉద్యోగాలు, విద్య, వైద్యం, భూములను దోచుకుంటున్నారని ఆరోపించారు. వలస లంబాడాలు ఎస్టీలు కారని అన్నారు. న్యాయపరంగా సుప్రీంకోర్టుకు వెళ్తున్న ఆదివాసీ నాయకులను లంబాడాలు బెదిరిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు దుర్వ విశ్వేశ్వర్ రావు, కనక అమత్ రావు, ఆడేం భీంరావు, మాడవి గంగారాం, గోడం రమేశ్, తొడసం నీలకాంత్, ఆత్రం దేవరావు, ఆత్రం మోహన్, పంద్రం సోనేరావు పాల్గొన్నారు.


క్షీరాభిషేకం చేస్తున్న సభ్యులు

నాణ్యమైన విద్యనందించాలి

ఉట్నూర్‌రూరల్: విద్యార్థులు నాణ్యమైన విద్యనందించాలని ఉట్నూర్ ఎంఈవో ఆశన్న అన్నారు. శనివారం మండలంలోని ఎంపీపీఎస్ లక్కారం, ఎంపీపీఎస్ లక్కారం ఎస్సీ కాలనీ, ఎంపీపీఎస్ గంగన్నపేట్ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో చేరిన ప్రతీ విద్యార్థి యుడైస్‌లో ఉండాలని ఆదేశించారు. అదేవిధంగా యుడైస్‌లో ఉన్న విద్యార్థులు ఎఫ్‌ఆర్‌ఎస్ రిజిస్ట్రేషన్ చేయాలని, ఏదైనా సమస్య ఉంటే సంబంధిత సీఆర్పీ లేదా ఎంఐఎస్‌తో కోఆర్డినేషన్ చేసుకొని సమస్యను పరిష్కరించాలన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

దహెగాం: మండల కేంద్రంలో ఎస్టీవాడతో పాటు మండలంలోని లగ్గాం, ఒడ్డుగూడ, గెర్రె, కర్జి, గ్రామాల్లో శనివారం వినాయకుడి నిమజ్జన శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. వినాయకుడి విగ్రహాన్ని పురవీధుల గుండా ఊరేగించారు. యువకులు, మహిళలు సంప్రదాయ నృత్యం చేశారు.

కౌటాల: మండలంలోని భక్తులు శనివారం భక్తిశ్రద్ధలతో ఆయా మండపాల్లో గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. గణేశ్ మండపాల వద్ద పోటాపోటీగా లడ్డూను వేలం వేశారు. కౌటాల శివాలయంలోని గణేశ్ నిమజ్జనంలో భక్తులు ప్రత్యేక నృత్యం చేస్తూ సందడి చేశారు. సమీప చెరువులు, వాగుల్లో విఘ్నేశ్వరుడి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

కాగజ్‌నగర్ టౌన్/ కాగజ్‌నగర్ రూరల్: పట్టణం, మండలంలో గణేశ్ నిమజ్జనాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల మధ్య గణపయ్యకు ఘనంగా వీడ్కోలు పలికారు. మహిళలు, చిన్నారులు చేసిన నృత్యం ఆకట్టుకుంది. ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, ఏఎస్పీ రామానుజం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వసుంధర డిగ్రీ కళాశాల సమీపంలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ చేశారు. పెద్దవాగు వద్ద అధికారులు ఏర్పాట్లు చేశారు.


దహెగాం: లగ్గాంలో వినాయకుడి శోభాయాత్ర


కౌటాల: పూజలు చేస్తున్న భక్తులు


నృత్యం చేస్తున్న, చిన్నారులు, మహిళలు


గణేశ్ నిమజ్జనంలో పాల్గొన్న మహిళలు

హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీవో

వాంకిడి: హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఖాజా అజీజుద్దీన్ అన్నారు. శనివారం మండలంలోని బంబార ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అందించే ఆహారంలో తాజా కూరగాయలు వాడాలని, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, నాణ్యతతో కూడిన విద్యను అందించాలని సూచించారు. ఏఎస్‌ఎమ్ అన్ని వేళలా అందుబాటులో ఉండాలని, జ్వరం, తదితర మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దుర్గం ధర్మయ్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వీధులన్నీ చిమ్మ చీకట్లోనే


కొత్తపల్లిలో వెలగని వీధి దీపం



కొత్తపల్లి చౌరస్తాలో వెలగని హైమాస్ట్ లైట్లు

- గ్రామాల్లో వెలగని వీధి దీపాలు
- పట్టించుకోని ప్రత్యేకాధికారులు

లింగాపూర్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వీధి దీపాలు వెలగక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీంతో రాత్రిపూట బయటకు వెళ్లేందుకు ప్రజలు జంకుతున్నారు. సర్పంచ్‌ల పదవీకాలం పూర్తయినప్పటి నుంచి గ్రామాల్లో సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వారు వాపోతున్నారు. ఇటీవల ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు రహదారులపై గుంతలు ఏర్పడి అందులో నీళ్లు నిలిచి ఉంటున్నాయి. చీకట్లో గుంతలు కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అంతేకాకుండా రహదారులపై క్రిమి కీటకాలు, పాములు, తేళ్లు సంచరిస్తాయని, లైట్లు లేకపోవడంతో అవి కాటువేసే ప్రమాదం ఉందని వారు ఆందోళన చెందుతున్నారు. విషయాన్ని ప్రత్యేకాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని అడిగితే నిధులు లేవని సమాధానం ఇస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండలంలోని వివిధ గ్రామాల్లో వీధి దీపాలు, హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

వాంకిడి: మండలంలోని డొంగర్‌గాంలో ఇటీవల మృతి చెందిన ఓ బాలింత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాం నాయక్ ఆధ్వర్యంలో శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్యాంనాయక్ మాట్లాడుతూ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దీపక్ ముండె, మాజీ ఎంపీటీసీ మారుతి, విలాస్, గోవింద్ రెడ్డి, నాగోసేన్, రహీమ్, విగ్నేష్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.


సరుకులు అందజేస్తున్న నాయకులు